# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 25 జూన్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 334

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## యుద్ధ విరామం



## అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం.. అసెంబ్లీకి రా.. నీ సంగతి చెపుతా: సీఎం.

# చర్చకు రా.. తేల్చుకుందాం!



**గోదావరి%-% బనకచర్లపై తప్పెవరిదో అసెంబ్లీలో మాట్లాడదాం**

**తారీఖు చెప్పి స్పీకర్‌కు లేఖ రాయి.. నేను పూర్తి వివరాలతో వస్తా**

**రైతుభరోసా విజయోత్సవ సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్**

**పదేళ్లు అధికారంలో ఉండి నదీ జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు**

**గోదావరి జలాలు సీమకు తరలించమని చంద్రబాబుకు చెప్పింది నువ్వు కాదా?**

> మేం తెలంగాణకు న్యాయం కోసం పోరాడుతున్నం. గోదావరి బనకచర్లకు అనుమతులు ఇవ్వవద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కేంద్రమంత్రిని కోరాం. ప్రాజెక్టులను పడావు పెట్టి మీరు ఫాంహౌస్‌లో పడుకుంటే.. మేం వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం. అప్పుడంటే జానారెడ్డి నీతో ఎందుకని ఊరుకున్నాడు. ఇప్పుడు అసెంబ్లీకి రా. నీ సంగతి చెపుతా..

హైదరాబాద్: పదేళ్ల అధికారంలో కొనసాగి కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేసీఆర్.. గోదావరి%-%బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తనపై దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు అసెంబ్లీలో చర్చకు రావా లని సవాల్ విసిరారు.

'నేను చంద్రబాబుతో కలిసిపోయి గోదావరి బనకచర్లకు నీళ్లిస్తున్నానని దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నావు. దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయమని ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో స్పీకర్‌కు లేఖ రాయి. గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసింది ఎవరు? ప్రాణహిత చేవెళ్లను తరలించి లక్ష కోట్లు దోచుకున్నది ఎవరో చర్చిద్దాం..' అని అన్నారు. కేసీఆర్ సూచనలతో హరీశ్‌రావు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు భరోసా కింద ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన నేపథ్యంలో మంగళవారం సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో రేవంత్ మాట్లాడారు. నీ దిక్కుమాలిన సూచన వల్లే ఈ దరిద్రం

'చంద్రబాబును కలిసి గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నయ్.. రాయలసీమకు తరలించమని 2016లో చెప్పింది నువ్వు కాదా? నువ్వు చెప్పినంకనే కదా ఉమాభారతి ఆదేశాల మేరకు చంద్రబాబు హంద్రీనీవా నుంచి 400 టీఎంసీలు తరలించడానికి 2016లో జీవో ఇచ్చిండు. 2018లో వ్యాప్కోస్ సంస్థను నియమించి, 400 టీఎంసీలు హంద్రీనీవా నుంచి బనకచర్లకు తరలించడానికి ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చింది నిజం కాదా? నువ్వు ఇచ్చిన దిక్కుమాలిన సూచనతోనే ఈ దరిద్రం దాపురించింది? తెలంగాణను ఎడారిగా మార్చేలా వందలాది టీఎంసీల నీటిని రాయలసీమకు


మిగతా 3లో


## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్





- తమ ఫోన్లు ట్యాప్ చేసినట్లు వాంగ్మూలం
- నత్తనడకన సాగుతోన్న ట్యాపింగ్ కేసు
- బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఆరోపణ

## కృష్ణా, గోదావరి జలాలపై కుట్రలు




ఏపి సిఎం తీరు నమ్మదగినదిగా లేదు

బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు




## కుమార్తె రాసిన మరణ శాసనం!

ఒక యువకుడి మోజులో పడి కన్నతల్లిని దారుణంగా హత్య చేసిందొక బాలిక. అతడితో ప్రేమ వద్దన్నందుకు ఈ ఘాతుకానికి పాల్పడింది. ప్రియుడు, అతడి సోదరుడితో తల్లిని హత్య చేయించింది.

**ప్రేమకు అడ్డొస్తోందని తల్లిని హత్య చేయించిన బాలిక ప్రియుడు, అతడి సోదరుడితో కలిసి ఘాతుకం**

## గాంధీభవన్‌లో వాడీవేడిగా పిఎసి సమావేశం

లోక్ల బాడీ ఎన్నికలపై ప్రధానంగా చర్చ




## రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాం



> 9 రోజుల్లో 9వేలకోట్లు ఖాతాల్లో జమ
>
> దేశంలో గ్రీన్ రివల్యూషన్ ఘనత కాంగ్రెస్‌దే
>
> రైతు భరోసా విజయోత్సవ సభలో డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్: దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లికించదగ్గ రోజు, ఈరోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పి రుజువు చేసుకున్నామని అన్నారు.

70 లక్షల మంది రైతులకు తొమ్మిది రోజుల్లో రూ. తొమ్మిది వేల కోట్లు వారి ఖాతాల్లో వేశామని గుర్తు చేశారు. సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రైతు భరోసా విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు త్యాగాలు చేసిన మహాను భావుడు రాజీవ్ గాంధీ అన్నారు. వ్యవసాయం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే వ్యవసాయమని తెలిపారు. రైతులకు మద్దతు ధర ఇచ్చింది కాంగ్రెస్, రైతులకు నిధులు ఇవ్వాలని చెప్పింది కాంగ్రెస్.. దేశంలో గ్రీన్ రెవల్యూషన్ తెచ్చింది కాంగ్రెస్ అని చెప్పారు. రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని.. భూమి లేని నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని చెప్పామన్నారు. రైతులకోసం బీఆర్ఎస్ ఏమీ చేయలేదని.. రైతులకు ఇవ్వాల్సిన అన్నింటినీ బంద్ చేసిందని విమర్శించారు. రైతు బంధు పేరుతో అరకొర నిధులు వేశారని ఆరోపించారు. చెప్పిన మాట ప్రకారం తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా ఇచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని రైతులు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. 'సంక్షోభం నుంచి సంక్షేమం వైపు వెళ్తున్నాము. ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. రాజీవ్ గాంధీ సూచనల మేరకు ముందుకు వెళ్తున్నాము. కొంతమంది కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు. 25 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు ఇతర పార్టీలకు లేదు. నాడు మన్మోహన్ సింగ్ చేశారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం చేసింది. అప్పటి ప్రభుత్వాలు నెలల తరబడి రైతుబంధు అన్నారు. పూర్తిగా కూడా చేయలేదు. తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా వేశాము. కష్టాలు, ఇబ్బందులు ఉన్నా నిధులు విడుదల చేశాం. పాత పథకాలు ఏవీ తీసివేయలేదు. గ్రామీణ తెలంగాణ మా గుండెల్లో ఉంటుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్ష కోట్లు రైతులకు ఖర్చు చేశాం. మాకు ప్రజలు ఐదు సంవత్సరాలు ప్రజలు సమయం ఇచ్చారు. మేము ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి ప్రజల ముందుకు వెళతాం.




## పెరగనున్న రైల్వే టిక్కెట్ ధరలు

జూలై 1నుంచే అమల్లోకి కొత్త రేట్లు

## అన్నీ ఎగ్గొట్టి.. పండగ చేసుకోమంటారా?



> పదేళ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండగలా ఉంటే, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో మాత్రం దండగయిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు.

హైదరాబాద్: పదేళ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండగలా ఉంటే, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో మాత్రం దండగయిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ మోసాలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'రూ.10వేల రైతుబంధు స్థానంలో రూ.15వేల రైతుభరోసా ఇస్తామని ఓట్లు వేయించుకున్నారు. ఇప్పుడు రూ.12 వేలకే కుదించడం సంబరమా? రైతుభరోసాను రెండుసార్లు ఎగ్గొట్టి ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం ఆగమేఘాల మీద డబ్బులు వేయడం సంబరమా? వ్యవసాయం అంటే రైతుభరోసా ఒక్కటేనా? సాగునీటితో రైతుకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఉచిత కరెంటుతో సాగుకు ఊతమివ్వాలి. పంట పెట్టుబడికి రైతుబంధుతో వెన్నుదన్నుగా నిలవాలి. మట్టిని నమ్ముకున్న రైతు ఏ కారణంతో మరణించినా ఆ కుటుంబాలకు రూ.5లక్షల రైతుబీమాతో ధీమానివ్వాలి. రైతుభరోసాను ఎగ్గొట్టి, రైతుబీమా పక్కన పెట్టి, రుణమాఫీ తుంగలో తొక్కి, సన్నవడ్ల బోనస్‌కు సున్నం పెట్టి, కల్లాల్లో ధాన్యం కొనకుండా కన్నీళ్లు పెట్టించి రైతులను పండగ చేసుకోమంటారా?' అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతులను నమ్మించి మోసం చేసినందుకు సంబరాలు చేసుకోవాలా అని మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు.

## పెరగనున్న రైల్వే టిక్కెట్ ధరలు

### జూలై 1నుంచే అమల్లోకి కొత్త రేట్లు

న్యూఢిల్లీ:రైల్వే ప్రయాణికులకు ఇది షాకింగ్ న్యూస్. జూలై 1వ తేదీ నుంచి రైల్వే టికెట్ ధరలు పెరగనున్నాయి. నాన్ ఎసి మెయిల్/ఎక్స్‌ప్రెస్ ట్రైన్ టికెట్ ధరపై కిలోమీటర్‌కు పైసా, ఎసి తరగతి టికెట్ ధర కిలోమీటర్‌కు రెండు పైసలు పెరగనుంది. ఈ విషయాన్ని కొన్ని మీడియా సంస్థలు వెల్లడించాయి. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. చాలా రోజుల తర్వాత రైల్వే టికెట్ ధరలు సవరిస్తున్నారు. తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవాలంటే.. ఆధార్ అథంటికేషన్ తప్పనిసరని రైల్వే శాఖ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మార్పు జూలై 1 నుంచి అమలులోకి రానుంది. దీంతో పాటే సమరించిన టికెట్ ధరలు కూడా అమలులోకి వస్తాయని తెలుస్తోంది. సబర్బన్ టికెట్ ధరలు, 500 కిలోమీటర్ల వరకూ సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఈ పెంపు వర్తించదు.. 500 కిలోమీటర్లు దాటితే పైసా చొప్పున చెల్లించాలి. సెలవారీ టికెట్ ధరల్లోనూ ఎలాంటి మార్పు ఉండబోదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## జగన్ కారణంగానే సింగయ్య మృతి

నెల్లూరు: మాజీ సీఎం జగన్ పర్యటనలో సింగయ్య మృతి చెందడం దారుణమని, దీనికి జగన్ బాధ్యత వహించాలని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు.. జగన్ సైడ్ బోర్డు మీద నిలబడి ప్రయాణం చేయడమే తప్పని... జగన్ షేక్ హ్యాండ్ ఇస్తున్న సమయంలోనే సంఘటన జరిగిందన్నారు. ఫేక్ వీడియో అనడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో వైఎస్ షర్మిలా రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆకుతోట గిరిజనకాలనీ నుంచి ఇందిరా భవన్ వరకు ర్యాలీగా వెళ్లారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు షర్మిల. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం అందరికీ అవసరమన్నారు. జగన్ ప్రతీ విషయంలోనూ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జనంలోకి వచ్చిన పరిస్థితి లేదని... ఇప్పుడేమో జనసమీకరణతో బలప్రదర్శన చేస్తున్నారని ƒ÷ర్ అయ్యారు. 'జగన్‌కు నిబంధనలు, ఆంక్షలు ఉండవు.
మూడు బండ్లు అంటే, ముప్పై బండ్లతో వెళతారు. జగన్ మోదీ దత్తపుత్రుడనా? కార్ల కింద మనుషులని నలుపుకుంటూ పోతూ, మానవత్వం గురించి మాట్లాడుతారా? జగన్‌కు అసెంబ్లీకి వెళ్లి సమాధానం చెప్పే దమ్ము లేదు. రుషికొండలని ఎందుకు గుండుగొరిగారు? మద్యపాన నిషేధం చేస్తామని ఎందుకు కుంభకోణానికి పాల్పడ్డారు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ను నిలబెట్టడానికి తన అవసరం ఉందని పంపించారని తెలిపారు. తనకు, జగన్‌కు ఉన్న విభేదాలు, రాష్ట్ర సమస్యలతో పోల్చితే చాలా చిన్నవన్నారు. జగన్ సీఎం అయిన వెంటనే తమకు విభేదాలు వచ్చాయన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఒక్కటే పోరాడగలదని స్పష్టం చేశారు. జగన్, వైఎస్ కుమారుడు అయినా మోదీకి దత్తపుత్రుడిగా ప్రతి బిల్లులోనూ బీజేపీకి మద్దతిచ్చారన్నారు. అదానీ, అంబానీలతో పాటు ఎవరికి ఏ మేలు కావాలన్నా చేశారని.. మెడలు వంచుతానని చెప్పి.. తానే మెడలు వంచారంటూ వ్యాఖ్యలు చేశారు. మన రాష్ట్రానికి ఏ మేలూ చేయని పార్టీ బీజేపీ అని విమర్శించారు. పదిహేనేళ్లుగా ఏపీ ప్రజలను బీజేపీ వెన్నుపోటు పొడుస్తుందన్నారు. ఇప్పుడు పోలవరానికి డబ్బులు ఇస్తామంటున్నారని... అయితే పార్లమెంటులో ఒక్క ఎంపీ కూడా పోలవరం ఎత్తు 45 ఉండాలని ప్రశ్నించే వారేలేరన్నారు. న్యూఢిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తామన్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతుకి రూ.20వేలు ఇస్తామని, ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు. 80 లక్షల మంది రైతులు ఉంటే, 45 లక్షలకు కుదించారన్నారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు బ్రహ్మాండంగా అమలు చేస్తుంటే, ఏపీలో ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే ఫించను ఇస్తామన్నారని అన్నారు. 'మిమ్మల్ని ప్రశ్నిస్తున్న మా నాలుకలు మందమా? ప్రజలని మోసం చేస్తున్న మీ నాలుకలు మందమా? వెంటనే అన్ని పథకాలు, హామీలని నెరవేర్చాలని' వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కాగా.. గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన షర్మిల.. పక్కనే ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించడాన్ని ఏపీసీసీ చీఫ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు మరవడం చర్చకు దారి తీసింది.

## కృష్ణా, గోదావరి జలాలపై కుట్రలు

హైదరాబాద్:గోదావరి,కృష్ణ జలాల వినియోగానికి సంబంధించిన అంశంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరును బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. నీటి వాటా విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణకు నష్టం చేయాలని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కీలక అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి చురుగ్గా స్పందించాల్సిన అవసరం ఉన్నా, కేబినెట్ సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరగకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ భవన్‌లో జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇప్పటికే కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ దోచుకున్న తీరును గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు అదే పరిస్థితి గోదావరి జలాలపై పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒక్కటై గోదావరి జలాలను కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. బీజేపీ నేతలూ నిర్లక్ష్యంగా మాట్లాడకూడదని, కేంద్రంలో మంత్రి స్థాయిలో ఉన్న వారు కూడా వాస్తవ పరిణామాలు తెలుసుకోకుండా వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. గోదావరి–కావేరీ లింక్ అంశాన్ని గొడవగా మార్చి, తన ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకోవాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించిన జగదీష్ రెడ్డి, అపెక్స్ కమిటీ సమావేశం కోసమే ప్రయత్నించాలే తప్ప, చంద్రబాబుతో ప్రత్యక్ష సమావేశం అనే ఆలోచనే తప్పు అని అన్నారు. చంద్రబాబుతో చర్చలకు వెళ్లడం అంటే దాసోహంగా మారిపోయినట్టేనని,

తెలంగాణ ప్రభుత్వాన్ని ఈ విషయంలో గట్టిగా స్పందించాలంటూ డిమాండ్ చేశారు. కేసీఆర్ చేసిన సూచనలతో ఇప్పటి పరిస్థితులను పోల్చుతూ, అప్పట్లో కేసీఆర్ సముద్రంలో వృథాగా పోతున్న నీటిని రెండు రాష్ట్రాలు కలిసి ఎలా వినియోగించుకోవాలో ఆలోచించాలని లేఖ రాశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం పూర్తిగా వక్రదిశలోనిదని, ఆయన లక్ష్యం తెలంగాణ ప్రజల హక్కులను పక్కదారి పట్టించడమేనన్నారు. రైతుల సంక్షేమం పేరుతో ప్రభుత్వం చేస్తున్న సంబరాలపై కూడా జగదీష్ రెడ్డి కఠినంగా స్పందించారు. 'రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసినందుకా సంబరాలు? రైతు భరోసా మూడు విడతలు వాయిదా వేసినందుకా సంబరాలు?' అని ప్రశ్నించారు. రైతులు అంటే కేవలం కొన్ని రాజకీయ నేతల కుటుంబాలేనా అని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు నమ్మి గెలిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆంధ్ర ప్రయోజనాలను కాపాడేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డిలా వ్యవసాయంపై ఇంత సాహసోపేతమైన నిర్ణయం ఎవరూ తీసుకోలేదని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్నవారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రూ.2లక్షల్లోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నామని.. అలాగే చేశామని గుర్తుచేశారు. రైతునేస్తం సభలో ఆయన మాట్లాడుతూ..తమను విమర్శించే హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని చెప్పారు. బీజేపీ కూడా కేంద్రంలో రూ. 4లక్షలు రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఐదు నెలల వరకు కూడా రైతుబంధు వేయలేదని.. కానీ ఇప్పుడు తమ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని ఉద్ఘాటించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామంటే కొందరు నేతలు నమ్మలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు తెస్తున్నామని వెల్లడించారు. ఏడాది కాలంలోనే రేవంత్ ప్రభుత్వం రైతుల కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులను మరువబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇంకా చాలా పథకాలు తీసుకురాబోతుందని ఉద్గాటించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన తర్వాతనే తమకు ఓటు వేయమని అడుగుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నిజంగానే ఈరోజు దేశ చరిత్రలో లిఖించదగిన రోజని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే

రూ.9000 కోట్లు రైతుల ఖాతాల్లో వేయడం దేశ చరిత్రలో ఇంతవరకు ఎక్కడ జరగలేదని చెప్పారు. 'వ్యవసాయం అంటే కాంగ్రెస్. వ్యవసాయం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్. రైతుల కోసం ఉచిత కరెంట్‌ని, గిట్టుబాటు

ధరను తెచ్చిందే కాంగ్రెస్. హరిత విప్లవాన్ని తెచ్చిందే కాంగ్రెస్. ఏ రాజకీయ పార్టీ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించలేదు. రైతుల కోసం బీఆర్ఎస్ ఏమి చేయలేదు. అందరి ఖాతాల్లో రూ.9000 కోట్లు వేస్తామని చెప్పామని.. అలానే వేశాం అని పేర్కొన్నారు.



దీనిపై దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలి

తెలంగాణ వాడుకోగా మిగిలిన నీటినే వాడుకుంటాం

తెలంగాణ అనేక ప్రాజెక్టులు కడుతున్న అడ్డుకోవడం లేదు

కేబినేట్‌లో సిఎం చంద్రబాబు వెల్లడి

# బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

అమరావతి: పోలవరం బనకచర్లపై తెలంగాణ నేతలు అందరూ మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణ కేబినెట్‌లో బనకచర్లపై వాళ్లు డిస్కస్ చేశారని అన్నారు. ఏపీ కూడా మన వాదనలు వినిపించాలని సూచించారు. తెలంగాణ వాళ్లు అనుమతి లేని ప్రాజెక్ట్‌లను కూడా కడుతున్నారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఇంకా చాలా ప్రాజెక్ట్‌లను వాళ్లు కడుతున్నారని తెలిపారు. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లను మాత్రమే కదా ఏపీ వాడుకునేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తెలంగాణ నేతలు బనకచర్లపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వరద జలాలను మనం వాడుకుంటామని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో కూటమి నేతలు చెప్పాలని ఆదేశించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై మనం దశల వారిగా ముందుకు వెళ్తామని సూచించారు. ఆ తర్వాత కేందప్రభుత్వం ఏం చెబుతుందో దాని ఆధారంగా మనం నిర్ణయం తీసుకుందామని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లు ఎప్పుడూ శంకుస్థాపన చేస్తామనేది త్వరగా నిర్ణయించాలని మంత్రి లోకేష్ అన్నారు. పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌కి అవసరమైతే కేంద్ర ప్రభుత్వ జోక్యం కూడా అవసరమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ విషయం అర్థమయ్యేలా చెప్పేందుకు అవసరమైతే కేంద్రం ద్వారా ఓ సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పారు. సున్నితమైన పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌పై నేతలు పూర్తి అవగాహనతో జాగ్రత్తగా మాట్లాడాలని దిశానిర్దేశం చేశారు. పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం ముగిసింది. మొత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు. పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉంది.' అని అన్నారు. అమరావతిలో మలివిడత భూసేకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తొలివిడత నిబంధనలే మలివిడతకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాస్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం తేల్చి చెప్పారు. సాంకేతిక సమస్యల సాకుతో దాటవేత ధోరణి సరికాదని, ఇబ్బందులుంటే తనతో మాట్లాడవచ్చన్నారు. రెవెన్యూ సమస్యలపై తరచూ అడుగుతూనే ఉంటానని గట్టిగా చెప్పారు. కూటమి ఏడాది విజయాలు ఇంటింటికీ తీసుకెళ్లే కార్యాచరణ రూపొందించామన్న సీఎం.. జులై 1 నుంచి ఎమ్మెల్యేలు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడాది పాలనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశం పెట్టాలని కోరారు.



## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో టెక్కీ

తిరుపతి: సైబర్ నేరగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. పోలీసులు ప్రజల్లో అవగాహన పెంచుతూ అప్రమత్తం చేస్తున్నప్పటికీ సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నవారి సంఖ్య పెరుగుతూనే ఉంది. తిరుపతిలో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల వలలో పడి భారీగా సొమ్ము పోగొట్టుకున్నాడు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తిరుపతి రురల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వర్క్ ఫ్రమ్ హోమ్ లో భాగంగా ఇంటి నుంచే పని చేస్తున్న ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి రూ. 2 లక్షల 18 వేలు పోగొట్టుకున్నాడు. మొదట పార్ట్ టైం జాబ్ అంటూ బాధితుడికి వాట్సాప్ లో మెసేజ్ చేశారు కేటుగాళ్లు. కొన్ని లింకులు పంపి వాటికి రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామంటూ నమ్మించారు.అలా కొంత డబ్బులు ఇచ్చి తర్వాత పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయంటూ ఆశ చూపారు కేటుగాళ్ళు.

## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

హైదరాబాద్: దమ్ము, ధైర్యం లేక తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు నత్తనడక సాగుతోందని, బిజెపి, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వేగం లేదని అన్నారు. ప్రభాకర్ రావు నిబంధనలు అతిక్రమించి మాజీ సిఎం కెసిఆర్ కోసం పని చేశారని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు. హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారని మండిపడ్డారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని భాజపా నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. 'భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు.

## గాంధీభవన్‌లో వాడీవేడిగా పిఎసి సమావేశం



హైదరాబాద్: గాంధీ భవన్ లో మంగళవారం పీఏసీ మీటింగ్ వాడీవేడిగా జరిగింది. తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్, సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్కతో పాటు మంత్రులు, పీసీసీ కార్యవర్గం పాల్గొన్న ఈ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. ఈ మీటింగ్ లో ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ నిర్మాణంపై చర్చించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. బూత్ లెవెల్ నుంచి పార్టీ పటిష్టతకు పని చేయాలని.. అందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్ళాలనీ పీసీసీ కి సూచన చేసినట్లు తెలిపారు. ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై చర్చించామని అన్నారు. ఈ కాలాన్ని గో÷–డలెన్ పీరియడ్ గా పీఏసీ అభినందనలు తెలిపిందని చెప్పారు. పంట నష్ట పరిహారాన్ని గత ప్రభుత్వం పదేళ్ళు పట్టించుకోలేదని.. కానీ ప్రజా పాలనలో రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పథకాలు అమలు చేస్తున్నామని.. ఈ ప్రభుత్వ పథకాలు ఇంటింటికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు గా రెండింటిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని భట్టీ తెలిపారు.
పీఏసీ మీటింగ్ లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన సన్నాహాలను తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ అడిగి తెలుసుకున్నారు. ఉప ఎన్నికపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ ఉప ఎన్నికలో కచ్చితంగా గెలవాల్సిందేనని ఆమె సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందర్నీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు బాధ్యతలు అప్పగించారు.
జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ కు ఎవరిని నియమిస్తున్నారని అడిగిన ప్రశ్నకు.. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని సీఎం రేవంత్ చెప్పారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని ఆదేశించారు. పార్టీ నిర్ణయించి అభ్యర్థిని ప్రకటించే వరకు ఎవరూ కామెంట్స్ చేయొద్దని సూచించారు.
పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ గా చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహిద్దామని.. పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బాధ్యతలు మంత్రులు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు.

# కుమార్తె రాసిన మరణ శాసనం!



హైదరాబాద్:ఒక యువకుడి మోజులో పడి కన్నతల్లిని దారుణంగా హత్య చేసిందొక బాలిక. అతడితో ప్రేమ వద్దన్నందుకు ఈ ఘాతుకానికి పాల్పడింది. ప్రియుడు, అతడి సోదరుడితో తల్లిని హత్య చేయించింది. వారు ఇంట్లో తల్లిని హతమారుస్తుంటే.. నిందితురాలు బయట కాపలా కాసింది. అమ్మ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నా కనికరం చూపలేదు. ఈ అమానుష ఘటన హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆమె ప్రియుడి సోదరుడు ఇద్దరూ మైనర్లు కావడం గమనార్హం. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..

చంపేద్దామా.. నన్ను చావమంటావా..!

మహబూబాబాద్ జిల్లా ఇనగుర్తి మండల కేంద్రానికి చెందిన సట్ల అంజలి (39) తెలంగాణ సాంస్కృతిక కళాకారుల బృందంలో కళాకారిణి. ఈమెకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. మొదటి భర్తతో కలిగిన కుమార్తె (15) ఉండగా.. అతడు మృతి చెందడంతో.. అంజలి రవిని రెండో పెళ్లి చేసుకున్నారు. తర్వాత మరో కుమార్తె జన్మించింది. ఏడాది క్రితం రెండో భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఇద్దరు కుమార్తెలతో కలిసి షాపూర్‌నగర్ హెచ్ఎంటీ సొసైటీలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. పదో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తెకు నల్గొండ జిల్లా కట్టంగూర్‌కి చెందిన డీజే నిర్వాహకుడు శివ (19) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో చాటింగ్ చేస్తుండేవారు. ఇది ప్రేమగా మారినట్లు తెలుసుకున్న అంజలి కుమార్తెను మందలించారు. అయినా మార్పు రాకపోవడంతో ఆమెకు, తల్లికి ఒకసారి పెద్ద గొడవ జరిగింది. ఈ క్రమంలో తల్లిని చంపేద్దామని బాలిక చాటింగ్ ద్వారా శివకు చెప్పగా తొలుత నిరాకరించాడు. 'నేను చనిపోయి, నీ పేరు మీద ఆత్మహత్య లేఖ రాస్తా'నని అతడిని బెదిరించడంతో అంగీకరించాడు. ఈ నెల 19న బాలిక ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తల్లి 20న జీడిమెట్ల ఠాణాలో కిడ్నాప్ కేసు పెట్టారు. కానీ బాలిక 20వ తేదీ రాత్రి ఇంటికి తిరిగి వచ్చింది. 23న తన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

మెడకు చున్నీ బిగించి: శివ, అతని సోదరుడు (17) కలిసి బైక్‌పై సోమవారం మధ్యాహ్నం 3.30 సమయంలో బాలిక ఇంటికి వచ్చారు. అమ్మ ఇంట్లో ఉందంటూ వారిద్దరినీ లోపలికి పంపిన బాలిక.. ఎవరూ రాకుండా బయట కాపలా కాసింది. ఇంట్లోకి వెళ్లిన నిందితులు.. అంజలి మెడను చున్నీతో బిగించారు. పెనుగులాటలో కింద పడడంతో ఆమె తలకు గాయమైంది. గొంతు బిగుసుకుపోవడంతో ముక్కులోంచి రక్తం కారుతూ అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ఈ సమయంలో బాలిక చెల్లెలు పాఠశాల నుంచి రాగా, 'అమ్మ ఇంట్లోకి రావొద్దని చెప్పింది..' అంటూ చెల్లిని నిందితురాలు పక్కింటికి పంపింది. అంజలి చనిపోయిందనుకుని శివ సోదరులు వెళ్లిపోయాక.. చిన్న కుమార్తె ఇంటికి వచ్చింది. మెడకు చున్నీతో నేలపై పడి కొట్టుకుంటున్న తల్లిని చూసి నిర్ఘాంతపోయింది. ఆసుపత్రికి తీసుకెళ్దామని అక్కకు చెబితే ఆమె పట్టించుకోలేదు. పైగా బయటికి వెళ్లిపోయిన శివకు నిందితురాలు ఫోన్ చేసి.. 'అమ్మ ఇంకా బతికే ఉంది.. వచ్చి చంపెయ్' అని చెప్పింది. దీంతో శివ, సోదరుడు మళ్లీ తిరిగొచ్చారు. మరోసారి చున్నీ బిగించి అంజలి ఊపిరిని ఆపేశారు. వారొచ్చే సమయానికి నిందితురాలు.. తన చెల్లెలిని ఏమార్చి మళ్లీ పక్కింటికి పంపింది.

ఆత్మహత్య అంటూ నాటకం: తల్లి చున్నీతో ఉరి వేసుకుని చనిపోయిందంటూ బంధువులకు నిందితురాలు ఫోన్ చేసి చెప్పింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. వ్యవహారం అనుమానాస్పదంగా ఉండడంతో బాలికను గట్టిగా ప్రశ్నించగా.. శివ, అతడి సోదరుడితో కలిసి తల్లిని హత్య చేయించినట్లు అంగీకరించిందని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ చెప్పారు. నిందితులు ముగ్గుర్నీ రాత్రికి రాత్రే అదుపులోకి తీసుకున్నారు. ఘటన స్థలాన్ని బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేశ్‌కుమార్, ఏసీపీ నరేశ్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ప్రజాగాయని విమలక్క తదితరులు అంజలి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.




# చర్చకు రా.. తేల్చుకుందాం!

తరలించమని చెప్పింది నువ్వు. నేను తప్పు చేసినట్టు ఒక్క ఆధారం చూపిస్తే దేనికైనా సిద్ధం. నేను మొత్తం వివరాలతో వస్తా? నువ్వు చెప్పిన తారీఖు నాడు అసెంబ్లీలో చర్చకు పెట్టించే బాధ్యత శ్రీధర్‌బాబు తీసుకుంటరు. నువ్వు, నేను చర్చ చేద్దాం. నువ్వు సిద్ధంగా ఉన్నవా?..' అని సీఎం నిలదీశారు. ఆ ప్రాజెక్టులన్నీ ఎందుకు ఆగిపోయాయి?

'బీఆర్ఎస్ పదేళ్ల వాళ్ల పాలన ఎలా ఉందో.. 18 నెలల మా పాలన ఎలా ఉందో గ్రామాల్లో, రచ్చబండల దగ్గర రైతులు చర్చ పెట్టాలి. వ్యవసాయాన్ని పండుగ చేయాలని 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంటుపై తొలి సంతకం చేశారు. రుణమాఫీ అమలు చేశారు. ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే మొదలయ్యాయి. కానీ కేసీఆర్ కుట్రలు, కుతంత్రాలతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. కాళేశ్వరం కూలేశ్వరమై లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయినయ్. ప్రాజెక్టు కూలిపోయినందుకు నిన్ను చిన్న కాళేశ్వరంలోనే ఉరి తీసినా తప్పు లేదని అక్కడి రైతాంగం అంటున్నది నిజం కాదా? కేసీఆర్ కాంట్రాక్టర్లకు రూ.2 లక్షల కోట్లు చెల్లించిండు. మరి రూ.1,000 కోట్లతో పూర్తి కావాల్సిన కల్వకుర్తి ఎందుకు ఆగిపోయింది? రూ.300 కోట్లతో పూర్తి కావాల్సిన భీమా, రూ.200 కోట్లతో పూర్తి కావాల్సిన నెట్టెంపాడు, రూ.6 వేల కోట్లతో పూర్తి కావాల్సిన సీతారామ ఎందుకు ఆగిపోయాయి? దేవాదుల పూర్తి చేస్తే 4 వేల ఎకరాలు సాగయ్యేవి..ఎందుకు పూర్తి చేయలేదు? ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులపై సీమాంధ్రులు నిర్లక్ష్యం వహించారన్న నువ్వు.. పదేళ్లలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశావా? ఈ దుర్మార్గానికి నువ్వు, నీ కుటుంబం కారణం కాదా? కృష్ణా జలాల్లో 68 శాతం కేటాయింపులు తెలంగాణలో, 32 శాతం కేటాయింపులు ఆంధ్రలో ఉండాలి. ఈ లెక్కన 555 టీఎంసీల వాటా తెలంగాణకు రావాలి. కానీ 290 టీఎంసీలు తెలంగాణకు తీసుకుని, 519 టీఎంసీలు ఆంధ్రకు ఇచ్చి తెలంగాణ రైతాంగానికి మరణశాసనం రాసిందే నువ్వు. అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం.. మీకు ఫామ్‌హౌస్‌లు ఎట్లా వచ్చినయ్?

'కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను క్యాన్సర్ బారిన పడేసి మాకు అప్పగించారు. కోకాపేట భూములు, ఓఆర్ఆర్ అమ్మి రైతుబంధు ఇచ్చారు. రైతుల పేరుతో అప్పులు చేసిండు.. దోపిడీ చేసిండు. తెలంగాణ రాష్ట్రం రాకముందు మీ ఆర్థిక పరిస్థితి ఏంటి? ఇప్పుడేంటి? మొయినాబాద్‌లో హరీశ్‌రావుకు, జన్వాడలో కేటీఆర్‌కు, గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఫామ్‌హౌస్‌లు ఎట్లా వచ్చినయ్? రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పు మిగిల్చి, పదేళ్లలో నిజాం నవాబుల కంటే ధనవంతులయ్యారు.

మేం మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశాం. మీరు పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ప్రజలకు చెప్పు. కాళేశ్వరం పేరుతో మీరు రూ.లక్ష కోట్లు కొల్లగొడితే.. 18 నెలల్లో లక్షా 4 వేల కోట్లు ఖర్చు చేసి రైతులను ఆదుకున్న చరిత్ర మాది. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న ఉక్కు సంకల్పంతో ప్రజా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం

మా తొలి ప్రాధాన్యత రైతులే

ప్రజా ప్రభుత్వంలో మా మొదటి ప్రాధాన్యత రైతులుం. ఆ తర్వాత మా ఆడబిడ్డలు, ఉద్యమకారులు, విద్యార్థులు. ఆనాడు కేసీఆర్ రైతుబంధు ఎగ్గొడితే మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.7,625 కోట్ల నిధులు విడుదల చేశాం. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం.

కేసీఆర్ ఆనాడు వరి వద్దంటే మేం వరి పండించండి అని చెప్పాం. చివరి గింజ వరకు కొనడమే కాదు.. మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడారు.

మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, వాకిటి శ్రీహరి, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ విరామం



వాషింగ్టన్, టెల్ అవీవ్, టెహ్రాన్: రణరంగంగా మారిన పశ్చిమాసియా శాంతించింది. ఇజ్రాయెల్, ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారికంగా ప్రకటన చేశారు. ఆ తర్వాత యుద్ధ విమానాలు శాంతించాయి. అయితే అంగీకారం కుదిరిన 3 గంటల్లోనే ఇరాన్ తమపై క్షిపణులను ప్రయోగించిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ప్రతి దాడుల హెచ్చరికలు చేసింది. అంతేకాదు.. ఇరాన్‌పై దాడులకు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బయలుదేరాయి. అయితే ట్రంప్ హెచ్చరికలతో అవి వెనక్కి వచ్చాయి. ఇజ్రాయెల్ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. తాము కాల్పుల విరమణకు కట్టుబడి ఉన్నామని, ఎటువంటి దాడులు చేయలేదని స్పష్టంచేసింది. మరోవైపు కాల్పుల విరమణను రష్యా అధ్యక్షుడు పుతిన్ స్వాగతించారు. సౌదీ అరేబియా, ఈజిప్టు కూడా స్వాగతించాయి.

ముగిసిన 12 రోజుల యుద్ధం

ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై క్షిపణులతో సోమవారం రాత్రి పరిమితంగా ఇరాన్ దాడులు చేసిన అనంతరం మంగళవారం ఉదయం కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ ప్రకటనకు, కాల్పుల విరమణ అమల్లోకి రావడానికి మధ్య ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. ప్రతిగా ఇరాన్ జరిపిన దాడుల్లో నలుగురు ఇజ్రాయెలీలు మరణించారు. ట్రంప్ ప్రకటన అనంతరం.. కాల్పుల విరమణను అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. అటు యుద్ధాన్ని ఆపేసినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. 'కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. దానిని దయచేసి ఉల్లంఘించకండి' అంటూ ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేశారు. ఆ వెంటనే ట్రంప్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని నెతన్యాహు ప్రకటించారు. ఉల్లంఘన జరిగితే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం అన్ని యుద్ధ లక్ష్యాలను సాధించిందని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీకి తెలిపారు.

శనివారం తాము జరిపిన దాడులు ఇజ్రాయెల్‌కు ఉపయోగపడ్డాయని, దీంతో ఆ దేశం కాల్పుల విరమణకు అంగీకరించిందని శ్వేతసౌధం ప్రకటించింది. ఖతార్ ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించిందని వివరించింది.

కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటన, దానిని ఉల్లంఘించిందన్న ఇజ్రాయెల్ ఆరోపణలపై ఇరాన్ స్పందించలేదు. చర్చల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భాగమయ్యారా లేదా అనేది తెలియలేదు. అయితే అంతకుముందే దాడులను నిలిపేసేందుకు సిద్ధమవుతున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. ఇరాన్ కాలమానం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు ఇజ్రాయెల్ కాల్పుల విరమణను అమల్లోకి తీసుకొచ్చిందని వెల్లడించారు.

శ్వేతసౌధంలో మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్

డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం

కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ఇరుదేశాలు పరస్పరం దాడులు చేసుకోవడాన్ని డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇరాన్, ఇజ్రాయెల్‌లు కాల్పుల విరమణను ఉల్లంఘించాయని విమర్శించారు. 'ఆ బాంబులను వేయొద్దు. అలా చేస్తే అది తీవ్ర ఉల్లంఘనే. మీ పైలట్లను తక్షణమే వెనక్కి రప్పించండి' అని ఇజ్రాయెల్‌ను ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ మళ్లీ అణ్వాయుధాల జోలికి వెళ్తే తీవ్ర పరిణామాలుంటాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరించారు. ఇరాన్‌కు అణ్వాయుధాలు అందకుండా చేయడంలో అమెరికా నిబద్ధతను చాటుకున్నామని తెలిపారు.

ఖతార్, ఇరాక్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసిందని భారత్‌లోని ఇరాన్ రాయబారి ఇరాజ్ ఎలాహి తెలిపారు. ఇలా ప్రపంచంలోని ఏ దేశమూ అమెరికా సైనిక స్థావరాలపై దాడి చేసే ధైర్యం చేయలేదని, తాము చేశామని పేర్కొన్నారు. అమెరికా ఇంకోసారి ఇరాన్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తే.. ప్రతి దాడి చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు.

ఇరాక్‌లో రాడార్ వ్యవస్థల ధ్వంసం

ఇరాక్‌లోని సైనిక స్థావరాలపై సోమవారం రాత్రి డ్రోన్లతో ఇరాన్ దాడులు చేసింది. ఇందులో కొన్ని అమెరికా స్థావరాలున్నాయి. ఈ విషయాన్ని ఇరాక్‌తోపాటు అమెరికా మంగళవారం ధ్రువీకరించింది. ఉత్తర బాగ్దాద్‌లోని క్యాంప్ తాజీలో, ధికర్ ప్రావిన్సులోని ఇమామ్ అలీ స్థావరంలో రాడార్ వ్యవస్థలను ఇరాన్ ధ్వంసం చేసిందని ఇరాక్ సైన్యం అధికార ప్రతినిధి సబా అల్-నామన్ తెలిపారు. మిగిలిన చోట్ల దాడులను అడ్డుకున్నామని వెల్లడించారు. పశ్చిమ ఇరాక్‌లోని అయిన్ అల్-అసద్, బాగ్దాద్ విమానాశ్రయానికి సమీపంలోని మరో స్థావరంపై దాడులను అడ్డుకున్నామని అమెరికా సీనియర్ సైనికాధికారి ఒకరు తెలిపారు.

తమపై ఇరాన్ 19 క్షిపణులను ప్రయోగించిందని ఖతార్ మేజర్ జనరల్ షాయెక్ అల్ హజ్రీ మంగళవారం తెలిపారు. ట్రంప్ మాత్రం.. 14 క్షిపణులతో ఇరాన్ దాడులు చేసిందని, 13 క్షిపణులను అడ్డుకున్నామని, ప్రమాదం లేకపోవడంతో ఒక దానిని వదిలేశామని తెలిపారు.

దాడుల నేపథ్యంలో తమ దేశంలో ఉన్న ఇరాన్ దౌత్యవేత్తకు ఖతార్ సమన్లు జారీ చేసింది. దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని ఆయనకు స్పష్టం చేసింది.

విమానాల పునరుద్ధరణ

సోమవారం రాత్రి గగన తలాలను మూసివేసిన గల్ఫ్ దేశాలు మంగళవారం ఉదయానికి పునరుద్ధరించాయి. ఖతార్ నుంచి విమానాలను పునరుద్ధరించారు.

ఇరు దేశాలకూ భారీ నష్టమే..

12 రోజులపాటు జరిగిన ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో రెండు దేశాలకూ భారీ నష్టం జరిగింది. ఇరాన్ దాడిలో 24 మంది ఇజ్రాయెలీలు మరణించగా.. 1,000 మందికిపైగా గాయపడ్డారు. ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 974 మంది ఇరానియన్లు మరణించగా.. 3,458 మంది గాయపడ్డారు.

యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో ఉన్న 250 మంది తమ దేశీయులను అమెరికా తరలించింది. ఇజ్రాయెల్‌లో 7,00,000 మంది అమెరికన్లున్నారు. వారిలో కొంత మందికి ద్వంద్వ పౌరసత్వం ఉంది.

విరమణ కొనసాగుతుందని ఆశిస్తున్నాం: రష్యా

కాల్పుల విరమణను రష్యా స్వాగతించింది. ఇది సుస్థిరంగా కొనసాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. తాము తొలి నుంచీ శాంతినే కోరుకుంటున్నామని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు.

ఇరాన్ 20 క్షిపణులను ప్రయోగించింది: ఇజ్రాయెల్

కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రకటన వచ్చాక మంగళవారం ఉదయం ఇరాన్ 20 క్షిపణులను ప్రయోగించిందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. బీర్షెబాలోని ప్రజలు అధికంగా ఉండే మూడు నివాస భవనాలపై క్షిపణులు పడ్డాయని తెలిపింది. ఘటనా స్థలి నుంచి నాలుగు మృతదేహాలను వెలికితీశామని వివరించింది. తొలుత ఐదు మృతదేహాలు దొరికాయని చెప్పినా ఆ తర్వాత నాలుగుగా ధ్రువీకరించింది.

# జవహార్ నవోదయకు "సత్యశోధక్" విద్యార్థి ఎంపిక.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జూన్ 24:**

జవహార్ నవోదయ విద్యాలయం, నిజాంసాగర్ కు ఈ విద్యాసంవత్సరం ఆరవ తరగతికి రెండవ విడత ఫలితాలలో కె. అభివర్ధన్ ఎంపిక అయ్యారు. మంగళవారం పాఠశాల నుండి నవోదయకు ఎంపికైన కె. అభివర్ధన్ ను ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికను అందించి సత్కరించారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే జవహార్ నవోదయ పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం అభినందనీయమని నర్సయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మమత శ్రీనివాస్, రాజన్న ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# నేతలపైనే కాదు.. అనుచరులపైనా నిఘా

హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కోసం స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు బృందం వ్యవహరించిన తీరు విస్తుగొలుపుతోంది. ఎవరినైనా లక్ష్యంగా చేసుకుంటే వారితోపాటు వారి అనుచరులు, డ్రైవర్లు, వ్యక్తిగత సహాయకులు, ఇంట్లో పని మనుషుల సెల్‌ఫోన్లపైనా నిఘా ఉంచిన తీరు సిట్ దర్యాప్తులో బహిర్గతమవుతోంది. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్.. ఇలా అందరిపై ఇదే రీతిలో వ్యవహరించినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఉదాహరణకు రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేసుకొని ఆయన సోదరుడు కొండల్‌రెడ్డిపై దృష్టి పెట్టారు. కొండల్‌రెడ్డి సన్నిహితులు సుభాష్‌రెడ్డి, కపిల్ ఫోన్ సంభాషణలనూ రహస్యంగా విన్నారు. అలాగే బండి సంజయ్ అనుచరులు బోయినపల్లి ప్రవీణ్‌రావు, తిరుపతి ఫోన్లపై నిఘా ఉంచారు. ఈటల రాజేందర్ తనయుడు నితిన్ పేరిట ఉన్న ఫోన్‌పై నిఘా పెట్టారు. అయితే ఆ ఫోన్‌ను రాజేందర్ స్వయంగా వినియోగించారు. మరోవైపు రాజేందర్ సతీమణి జమున నిర్వహించే జమున హేచరీస్ పేరిట నమోదై ఉన్న మొబైళ్లతోపాటు రాజేందర్ బంధువు, జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ గోపాల్‌రెడ్డి ఫోన్లపై నిఘా ఉంచినట్లు గుర్తించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డిని లక్ష్యంగా చేసుకొని ఆయన కుటుంబ వ్యాపార సంస్థలకు చెందిన సుమారు 40 మంది ఉద్యోగుల సెల్‌ఫోన్లపై నిఘా ఉంచారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, కేఎస్ రత్నం.. ఇలా పలువురు నేతల పట్ల ఈ తీరులోనే వ్యవహరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డిపైనా నిఘా ఉంచారు.ఎస్ఐబీ ఇచ్చిన జాబితాలో వారు సైతం..: గత భారాస ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలపైనా గురి కొనసాగింది. 2023 నవంబరు 15 నుంచి 30 వరకు 4,013 ఫోన్ నంబర్లపై నిఘా ఉంచినట్లు సిట్ గుర్తించింది. ఇందులో పొలిటికల్ ట్యాపింగ్‌కు సంబంధించి 618 నంబర్లను ఎస్ఐబీ సిట్ అధికారులకు ఇచ్చింది. ఈ జాబితాలో భారాస నేతలు సైతం ఉండటం గమనార్హం.


మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తదితరులపై దృష్టి పెట్టినట్లు తేలింది.

# విజయ్‌తో లవ్‌లో త్రిష ...అంటూ పుకార్లు





ఓ స్టార్ హీరోతో హీరోయిన్ త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి. సదరు హీరోతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో త్రిష పంచుకుంటూ బర్త్‌డే విషెస్ తెలియజేయడం, అదే ఫొటోను ఆమె తల్లి షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీ జోడించడం అందుకు కారణం. ఆ రూమర్స్‌పై త్రిష పరోక్షంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రేమపై పోస్టు పెట్టారు. పూర్తిగా ప్రేమలో మునిగిపోతే, అది కొందరిని తికమక చేస్తుందని పేర్కొన్నారు. తాజాగా కోలీవుడ్ హీరోయిన్ త్రిష చేసిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో రచ్చకు కారణమైంది. జూన్ 22న విజయ్ బర్త్ డే సందర్భంగా హ్యాపీ బర్త్ డే బెస్టెస్ట్ అని హగ్ సింబల్ జత చేసి విజయ్ తో పక్క పక్కనే కూర్చున్న పిక్ షేర్ చేసింది త్రిష. అంతేనా ఈ ఫోటోకు త్రిష తల్లి సైతం లవ్ సింబల్స్ జోడించి ఇన్‌స్టా స్టోరీ పెట్టింది. దాంతో త్రిష, విజయ్ మధ్య లవ్ అఫైర్ ఉందని నెటిజన్స్ వీరిని లవర్స్ గా కన్ఫామ్ చేసారు. ఈ ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారని చాలా కాలం వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఈ ఇద్దరు ఎప్పుడు వాటిని ఖండించలేదు. విజయ్ అండ్ త్రిష లవ్ బర్డ్స్ అంటూ ఇప్పటి నుండే కాదు.. ఎప్పటి నుండో గాసిప్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇద్దరూ కలిసి జర్నీ చేయడం, కీర్తి సురేష్ పెళ్లికి గోవా వెళ్లడం కూడా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని కన్ఫర్మ్ చేస్తున్నారు నెటిజన్లు. రీసెంట్లీ గుడ్ పీపుల్, గుడ్ టైమ్స్ అంటూ ఓ పోస్ట్ పెట్టింది త్రిష. బర్త్ డే రోజు విజయ్ కుక్క పిల్లని ఎత్తుకున్న ఫోటో షేర్ చేసింది. కుక్క పిల్లను ఈ ఏడాదే ఫిబ్రవరిలో త్రిష దత్తత తీసుకుంది. అంటే ఆ ఫోటో రీసెంట్ గా తీసుకుంది. ఇద్దరు కలిసి త్రిష ఇంట్లో పార్టీ చేసుకున్నారన్న టాక్ నడుస్తోంది. త్రిష, విజయ్ 2004లో గిల్లీ సినిమాలో తొలిసారి జతకట్టారు. 2006లో ఆదితో పాటు రీసెంట్లీ లియోలోను కలిసి నటించారు. తన 25 సంవత్సరాల కెరీర్లో ఇప్పటి వరకు స్పెషల్ సాంగ్ చేయని త్రిష గోట్‌లో విజయ్ కోసం నర్తించింది. దీంతో ఈ ఇద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ అనే చర్చకు బలం చేకూరింది.



# అనుపమ మూవీకి సెన్సార్ కష్టాలు

మలయాళ నటులు అనుపమ పరమేశ్వరన్, కేంద్రమంత్రి సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను కాస్మోస్ ఎంటర్‌టైన‌మెంట్స్ నిర్మిస్తుండగా.. శృతి రామచంద్రన్, మాధవ్ సురేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూన్ 27 ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ అభ్యంతరం వలన సినిమా వాయిదా పడినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో బాధితురాలి పాత్రకు జానకి అని దైవ సంబంధమైన పేరుని పెట్టడంపై ముంబై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో జానకి అనే పేరుతో ఓ మహిళ అత్యాచార బాధితురాలిగా న్యాయపోరాటం చేస్తుందని, అయితే 'జానకి' అనేది సీతాదేవికి మరో పేరు కావడంతో, అలాంటి పేరును అత్యాచార బాధితురాలికి పెట్టకూడదని సెన్సార్ బోర్డు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందిస్తూ, జూన్ 27న విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడిందని ధృవీకరించారు. ఈ నిర్ణయంపై మలయాళ సినీ పరిశ్రమలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్నికృష్ణన్ సెన్సార్ బోర్డు నిర్ణయాన్ని విమర్శించారు. దేవుళ్ల పేర్లు కలిగిన పాత్రలకు ఇటువంటి నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందని, ఇది కళాత్మక స్వేచ్ఛను అడ్డుకుంటుందని ఆయన అన్నారు. ఇలాంటి నిబంధనలు ఉంటే, హిందూ మతానికి చెందిన పాత్రలకు పేర్లు ఎంపిక చేసుకోవడం చాలా కష్టమవుతుందని ఆయన ప్రశ్నించారు. తిరువనంతపురంలోని ప్రాంతీయ సెన్సార్ కార్యాలయం ఈ చిత్రానికి ఐ/ఎ సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, ముంబైలోని ప్రధాన కార్యాలయం ఈ టైటిల్‌ను మార్చాలని డిమాండ్ చేయడంతో ఈ సమస్య తలెత్తింది. పేరు మార్చాల్సి వస్తే, సినిమాలోని అనేక సంభాషణలను కూడా మార్చాల్సి వస్తుందని మేకర్స్ ఆందోళన చెందుతున్నారు.

# హిందీలో మజ్దూర్‌గా వస్తున్న రజనీకాంత్

తలైవా రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా ఇది. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. అగ్ర నటులు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహీర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగష్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ




సందర్భంగా మూవీ నుంచి వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి తాజాగా హిందీలో టైటిల్‌ను మార్చారు మేకర్స్. హిందీలో ఈ సినిమాను 'మజ్దూర్' అనే పేరుతో తీసుకురాబోతున్నట్లు సమాచారం. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు అని అర్థం. అయితే కూలీ అనే టైటిల్ బాగానే ఉన్నప్పటికి పేరు మార్చడంపై చాలా మంది నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గతంలో వచ్చిన అమితాబ్ బచ్చన్ కూలీ (1983), గోవిందా కూలీ నెం. 1 (1995), వరుణ్ ధావన్ కూలీ నెం. 1 (2020) వంటి చిత్రాల కాపీరైట్ సమస్యల వల్లే ఈ పేరు మార్పు జరిగిందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.

# ధనుష్ ..మీరెంత మంచి వారో ప్రశంసలతో పోస్ట్ చేసిన రష్మిక





కోలీవుడ్ స్టార్ ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రలో, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందించిన తాజా చిత్రం 'కుబేర' సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న కుబేర.. మంచి వసూళ్లతో సత్తా చాటుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అదిరిపోయే కలెక్షన్లు రాబడుతోంది. ఈ మూవీ ద్వారా నాగ్ లో కొత్తకోణం కనిపించింది. ఇక ధనుష్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు అయితే ఫిదా అయ్యారు. ఇందులో సమీరా పాత్రలో నటించిన రష్మిక కూడా ప్రేక్షకులను మెప్పించింది. అయితే తాజాగా తన కోస్టార్ ధనుష్ గురించి ఒక ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది రష్మిక. 'మీతో అంత పెద్ద సినిమా చేసినప్పటికీ మనిద్దరిది ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మీరు అద్భుతమైన వ్యక్తి, మనం మట్లాడుకున్న ప్రతిసారీ వేర్వేరు నగరాల్లో ఉన్నాం. ఇద్దరం వేర్వేరు పనులు చేసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించేవాళ్లం. కానీ, విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. కుబేర నటనపరంగానే కాదు.. నిజ జీవితంలోనూ మీరు చేసే పనులు ఎంతోమందికి ఆదర్శం. చుట్టూ ఉన్న వారితో ఎంతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటారు. ముఖ్యంగా మీరు సెట్‌ల్లో నాకోసం తెచ్చిన లడ్డులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాకు తమిళ డైలాగుల్లో మీరు చేసిన సహాయం.. నేను ఏదైనా డైలాగ్ చెప్పినప్పుడు మీరు ప్రశంసించిన తీరు. ఇవన్నీ చిన్న చిన్న విషయాలు కావచ్చు. కానీ, జీవితమంతా గుర్తుంటాయి'




# నవీన్ చంద్ర షో టైమ్ ట్రైలర్ విడుదల

**టాలీవుడ్ యువ నటుడు నవీన్ చంద్ర, పోలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'షో టైమ్'. ఈ సినిమాకు మదన్ దక్షిణామూర్తి దర్శకత్వం వహిస్తుండగా.. నరేష్, రాజా రవీంద్ర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అనుకోకుండా మర్డర్ చేసిన నవీన్ చంద్ర కామాక్షి దంపతులు.. ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డారు అనే కథతో ఈ సినిమా రాబోతుంది.**

# మీనాకుమారి బయోపిక్‌లో కియారా అద్వానీ



బాలీవుడ్‌లో మళ్లీ బయోపిక్‌ల ట్రెండ్ జోరుగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మరో బయెపిక్ తెరమీదకి రాబోతుంది. దివంగత నటి, 'ట్రాజెడీ క్వీన్' గా ప్రసిద్ధి చెందిన మీనా కుమారి జీవితం ఆధారంగా ఒక బయోపిక్ రాబోతున్నట్లు తెలుస్తుండగా.. ఈ చిత్రంలో కియారా అద్వాణీ మీనాకుమారి పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అలనాటి 'ట్రాజెడీ క్వీన్' మీనా కుమారి గురించి సినీ ప్రియులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'బైజుబావ్రా', 'పాకీజా' వంటి క్లాసిక్ చిత్రాలతో భారతీయ సినిమా చరిత్రలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు మీనా కుమారి. ఆమె జీవితంలో దాగి ఉన్న భావోద్వేగాలు, బాధలు, కీర్తి, ప్రేమ.. ఇలా అన్నీ వెండితెరపై మరోసారి ప్రతిభావంతంగా ఆవిష్కరిం చేందుకు బాలీవుడ్ సిద్ధమవుతోంది. ఈ భారీ బయోపిక్‌కు ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించబోతున్నట్లు సమాచారం. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మనీష్, ఇప్పుడు సినిమా దర్శకత్వంలో అరంగేట్రం చేయనుండగా, ఆయన తొలి చిత్రమే 'మీనా కుమారి' బయోపిక్ కావడం విశేషం. తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రతిష్టాత్మక బయోపిక్‌లో కియారా అద్వాణీనే కథానాయికగా ఎంపికైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మీనా కుమారి పాత్రలో నటించేందుకు పలువురు హీరోయిన్‌లు ఆసక్తి చూపినప్పటికీ, ఆ పాత్రకు అవసరమైన భావోద్వేగం, విలువ, గంభీరత కియారా నుంచే రావచ్చని చిత్ర బృందం బలంగా నమ్ముతోందట. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశలో ఉన్నాయని, దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని కియారా సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.